వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 029
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
జనవరి 06, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## డ్రంకెన్ డ్రైవ్ లో 38మందిపై కేసులు



డ్రంకెన్ డ్రైవ్ లో 38మందిపై కేసులు నమోదు చేసినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ కె.సుజాత తెలిపారు. వీరిని మంగళవారం మేజిస్ట్రేట్ కె.లక్ష్మీనారాయణ ఎదుట హాజరు పరచగా కడప జిల్లా కొత్తపేటకు చెందిన మొగిలి చంపాల జయ సింహకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. దీంతో హుజూరాబాద్ సబ్ జైలుకు తరలించారు. మిగిలిన 37 మందికి రూ.29,400 జరిమానా విధించారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన ఇద్దరిని కోర్టులో హాజరు పర్చగా వారికి రూ.1,500 జరిమానా విధించినట్లు సుజాత వెల్లడించారు.– వరంగల్ వాయిస్, కాశీబుగ్గ

వివరాలు2లో..





# సమ్మక్క సేవలో.. సీతక్క

## అభివృద్ధి నుంచి ఆహ్వానం వరకు అన్నీ తానే..



**రూ.251 కోట్లతో చరిత్రలో నిలిచేలా నిర్మాణాలు**
**అక్కడే మకాం వేసి పర్యవేక్షణ ◻ పారదర్శకంగా పనులు నిర్వహణ**
**మేడారం జాతర ప్రత్యేక లోగో ఆవిష్కరణ**
**రాష్ట్రపతి, పీఎం, సీఎం, ఇతర ప్రముఖులకు ఆహ్వానం**

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన మహాజాతరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క ) అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. అభివృద్ధి మొదలుకొని ఆహ్వానం వరకు తన మార్క్ చూపిస్తున్నారు. శాసనసభ సమావేశాలు మినహా మిగతా సమయమంతా మేడారంలోనే గడుపుతూ జాతర నాటికి అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయించేందుకు ఆరాటపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.251 కోట్లతో మేడారం మాస్టర్ ప్లాన్ రూపొందించడంతో పాటు చరిత్రలో నిలిచిపోయేలా దేవస్థాన ఆధునీకరణకు కంకణం కట్టుకున్నారు. ఇప్పటికే మేడారం జాతర ప్రత్యేక లోగోను ఆవిష్కరించడంతోపాటు రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులతోపాటు ఇతర ప్రముఖులను ప్రత్యేకంగా కలిసి జాతరకు రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ టీఎస్. దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రాల సహాయ, సహకారాలతో మంత్రి సీతక్క పనులను చక్కదిద్దుతున్నారు. స్వాగత తోరణాలు, పాలరాతి శిల్పాలతోపాటు గిరిజనుల జీవనశైలి, సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేస్తున్న శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. – వరంగల్ వాయిస్, మేడారం



8లో..

## వారంలో మూడు రోజులు ప్రజాబాట

- క్షేత్ర స్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎండీ వరుణ్ రెడ్డి

## సమ సమాజ స్థాపనకు కృషి చేయాలి

- శాస్త్రీయ దృక్పథానికి విద్యార్థులు పోరాడాలి
- ప్రొఫెసర్ వికాస్ వాజ్ పాయి

8లో..




3లో..



## వైభవంగా అన్నారం ఉర్సు ఉత్సవాలు

- మొదటి రోజు గంధం పూజ
- నేడు దీపారాధన.. అన్నదానం












# సమ్మక్క సేవలో.. సీతక్క

- అభివృద్ధి నుంచి ఆహ్వానం వరకు అన్నీ తానే..
- రూ.251 కోట్లతో చరిత్రలో నిలిచేలా నిర్మాణాలు
- అక్కడే మకాం వేసి పర్యవేక్షణ
- పారదర్శకంగా పనులు నిర్వహణ
- మేడారం జాతర ప్రత్యేక లోగో ఆవిష్కరణ
- రాష్ట్రపతి, పీఎం, సీఎం, ఇతర ప్రముఖులకు ఆహ్వానం

**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.251కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయి. పనుల్లో పారదర్శకత, జాతరకు ముందే వంద శాతం పనులు పూర్తి చేయించాలన్న లక్ష్యంతో సీతక్క అక్కడే మకాం వేసి అధికారులు, కాంట్రాక్టర్ లను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. చరిత్రలో నిలిచిపోయేలా జాతర సక్సెస్ కు నిద్రాహారాలు మాని పనిచేస్తున్నారు.

## రూ.251 కోట్లతో అభివృద్ధి..

గతంలో ఎన్నడూ లేని విధంగా మేడారంలో రూ.251 కోట్లతో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేవస్థాన ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా మేడారం జంక్షన్లకు కొత్త హంగులు సంతరించుకున్నాయి. స్వాగత తోరణాలు, పాలరాతి శిల్పాలతోపాటు గిరిజనుల జీవనశైలి, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేస్తున్న శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మేడారం చేరే మార్గాల్లోని ప్రధాన జంక్షన్లు తాడ్వాయి, జంపన్నవాగు, పస్రా, ములుగు జంక్షన్లుకు సరికొత్త అందాలు అద్దుతున్నారు. కోయ, గిరిజనుల నృత్యాలు, వీరుల విల్లు–బాణాలు, కొమ్ము ఆకృతులు, వన్యప్రాణులు, అడవి సంపద, సమ్మక్క–సారలమ్మ చరిత్రను చిత్రీకరించే బొమ్మలు ఈ శిల్పాల్లో కనిపిస్తున్నాయి.

## పోటెత్తుతున్న భక్తులు..

మహా జాతరకు సమయం సమీపిస్తుండటంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. వనదేవతలను దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. సాధారణ రోజుల్లో 40 వేల నుంచి 50 వేల వరకు భక్తులు అమ్మవార్ల మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆదివారం భక్తుల సంఖ్య రెట్టింపడుతోంది. అయితే మేడారం తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## జాతర ప్రత్యేక లోగో..

ఈ నెల 28 నుంచి 31వరకు సమ్మక్క–సారలమ్మ మహా జాతర సరికొత్త హంగులతో వైభవంగా జరుగనుంది. గద్దెల ప్రాంగణం, జంపన్నవాగుతోపాటు జాతర జరిగే ప్రాంతం మొత్తాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. అభివృద్ధి పనుల్లో 95 శాతం పనులు పూర్తి అయ్యాయి. ఈ నెల 12 నాటికి వంద శాతం పనులు పూర్తి చేయనున్నట్లు అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జాతర కోసం ప్రత్యేకంగా లోగోను రూపొందించి ఆవిష్కరించారు. గద్దెల నుంచి చిలకల గుట్టకు వెళ్లే మార్గంలో కుడివైపు ప్రత్యేకంగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు.

## 19న సీఎం చేతుల మీదుగా ప్రారంభం..

మేడారం పునర్నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18న సీఎం మేడారం చేరుకొని అక్కడే బస చేస్తారన్న ప్రచారం సాగుతోంది. 19వ తేదీ ఉదయం పనులను ప్రారంభించడంతోపాటు సమ్మక్క–సారలమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున మొక్కులు చెల్లిస్తారు. అక్కడి నుంచి హైదరాబాద్ కు చేరుకుని దావోస్ సదస్సుకు వెళ్లనున్నారు. అయితే సీఎం దావోస్ కు వెళ్లనున్న నేపథ్యంలో ప్రారంభోత్సవాన్ని ఒక రోజు ముందుగానే పూర్తి చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# వైభవంగా అన్నారం ఉర్సు ఉత్సవాలు

◆ ఘనంగా గంధం పూజ

◆ నేడు దీపారాధన.. అన్నదానం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అన్నారం షరీఫ్ హజ్రత్ యాకూబ్ షావలీ బాబా ఉర్సు ఉత్సవాలు సోమవారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు బాబా సమాధికి గంధం సమర్పించే కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది.



### ఘనంగా గంధం ఊరేగింపు..

ముందుగా దర్గా ముతావలీలు (ముజావర్లు) తమ నివాసం నుంచి గంధాన్ని సేకరించి, డప్పు చప్పుళ్లు, ఫకీరుల విన్యాసాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా దర్గాకు చేరుకున్నారు. సుమారు 4 గంటల పాటు సాగిన ఈ ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం యాకూబ్ షావలీ బాబా మజర్ (సమాధి) తో పాటు, మహబూబీ మా, గుంషావాలి, బోలె షావలీ, గౌసేపాక్ చిల్లాలను రోజ్ వాటర్‌తో శుభ్రం (గుసుల్) చేసి, ఆనవాయితీ ప్రకారం గంధం, దట్టీలు, పూల చాదర్లను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

### నేడు దీపారాధన.. అన్నదానం..

ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం దర్గా ప్రాంగణంలో భక్తులు దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం భక్తులందరికీ భారీ స్థాయిలో మహా అన్నదాన కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు వక్స్ బోర్డ్ అధికారులు, ముజావర్లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

### పోలీసుల భారీ బందోబస్తు..

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూరు ఏసీపీ వెంకటేష్, సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో పర్వతగిరి ఎస్సై ప్రవీణ్ నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం డీసీపీ అంకిత్ కుమార్ దర్గాను సందర్శించి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్స్ బోర్డ్ ఇన్ స్పెక్టర్ రియాజ్ పాషా, గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





# కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

▪ వినయ్ భాస్కర్ మంత్రి కావాలి

▪ శబరిమలలో చాగంటి రమేష్ మొక్కులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఉద్యమకారుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకుడు చాగంటి రమేష్ శబరిమల అయ్యప్ప సన్నిధిలో తన భక్తిని, రాజకీయ ఆకాంక్షను చాటుకున్నారు. అయ్యప్ప స్వామి మాల ధరించి 101 రోజుల దీక్షను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆయన, ఇరుముడితో శబరిమల యాత్ర చేపట్టారు. పంబా నది నుంచి అయ్యప్ప సన్నిధానం వరకు అత్యంత కఠినమైన 'చిన్నపాదం' మార్గంలో నడుస్తూ ఆయన పదునెట్టాంబడి ఎక్కారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాలను కాంక్షిస్తూ ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యాత్ర పొడవునా నెత్తిన ఇరుముడి, చేతిలో ఫ్లెక్సీ ధరించి రమేష్ తన మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ



రాష్ట్రానికి కేసీఆర్ గారు మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో దాస్యం వినయ భాస్కర్ భారీ మెజారిటీతో విజయం సాధించి, రాష్ట్ర మంత్రివర్గంలో చోటు సంపాదించాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని అయ్యప్ప స్వామిని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రుద్రోజ్ సంపత్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# దివ్యాంగుల చిరునవ్వులోనే నిజమైన పండుగ

• డాక్టర్ అనితా రెడ్డి, డీసీపీ రవి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అందరినీ సంతోషపెట్టడమే నిజమైన పండుగ సంబరమని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో హన్మకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో "నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి కైట్స్ ఫెస్టివల్" మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హన్మకొండ అడ్మిన్ డీసీపీ ఎన్.రవి, డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి, వారితో కలిసి పతంగులు ఎగురవేసి సందడి చేశారు. కల్మషం ఎరుగని పిల్లల మధ్య పండుగ జరుపుకోవడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ రవి, డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల హక్కులను కాపాడటం, వారికి ఆనందాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. దేశ భవిష్యత్తు అయిన చిన్నారులకు సుందరమైన బాల్యాన్ని




అందించాలి. ఈ పిల్లలకు ప్రేమ, ఆప్యాయతలను పంచుతూ వారితో సమయం గడపడం 'విశ్వమానవ సేవ' అని కొనియాడారు. వేడుకల్లో భాగంగా ఆశ్రమ పిల్లలు చేసిన డ్యాన్సులు, పాడిన పాటలు అతిథులను ముగ్ధులను చేశాయి. పతంగులు ఎగురవేస్తూ పిల్లలు ఆనందంతో గంతులు వేశారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ సీఐ శ్యామ్ సుందర్, సుచరిత, రాజేందర్ రెడ్డి, వసుధ, హరిత, భార్గవి, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఉప్పల్ గ్రామ శివారు భీంపల్లి రోడ్డులో ఆటోట్రాలీ, బైక్ పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికి చెందిన రేణికుంట్ల ఆకాష్ (25) అనే యువకుడు తన పని నిమిత్తం తనుగుల నుంచి హనుమకొండకు బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో ఉప్పల్ గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆటోట్రాలీ వేగంగా వచ్చి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆకాష్ తీవ్ర రక్తగాయాలపాలయ్యాడు. ప్రమాద ధాటికి యువకుడి కుడి చేయి, కుడి కాలు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే కమలాపూర్ 108 సిబ్బంది (EMT బండ ఉపేందర్, పైలట్ చెలిక తిరుపతి) ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్ర రక్తస్రావమవుతున్న యువకుడికి ప్రాథమిక చికిత్స అందిస్తూ, మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# ఏబీవీపీ స్టేట్ యూనివర్సిటీస్ 'ప్రాంత ప్రాముఖ్'గా అంబాల కిరణ్



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** అఖిల భారత విద్యార్థి పరిషత్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ప్రాంత ప్రాముఖ్‌గా కాకతీయ విశ్వవిద్యాలయ గణిత శాస్త్ర పరిశోధక విద్యార్థి అంబాల కిరణ్ నియమితులయ్యారు. ఈ నెల 3 నుంచి 5 వరకు శంషాబాద్‌లో నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రావుల కృష్ణ ఈ నూతన కమిటీని ప్రకటించారు. అంబాల కిరణ్ గతంలో ఏబీవీపీలో వివిధ కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ఆయన వరంగల్ మహానగర కార్యదర్శిగా, వరంగల్ జిల్లా కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా సేవలందించారు. ఆయన అనుభవాన్ని గుర్తించి రాష్ట్ర నాయకత్వం ఈ కీలక బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా అంబాల కిరణ్ మాట్లాడుతూ.. యూనివర్సిటీల బలోపేతానికి ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ నియామకం పట్ల కేయూ విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అంబాల కిరణ్‌కు అభినందనలు తెలిపారు.

# ఏబీవీపీ స్టేట్ యూనివర్సిటీస్ కో-కన్వీనర్‌గా మేకల జ్ఞానేశ్వర్



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** అఖిల భారత విద్యార్థి పరిషత్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల కో-కన్వీనర్‌గా మేకల జ్ఞానేశ్వర్ నియమితులయ్యారు. ఈ నెలలో శంషాబాద్‌లో నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభల సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రావుల కృష్ణ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. చీకురాయి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్ కుమారుడైన జ్ఞానేశ్వర్, ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ (జర్నలిజం) ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ప్రస్తుతం ఆయన కేయూ యూనివర్సిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థి సమస్యలపై ఆయన చూపుతున్న చొరవను గుర్తించి సంఘం రాష్ట్ర స్థాయిలో ఈ కీలక బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా మేకల జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన ఏబీవీపీ రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలోని విద్యారంగ సమస్యలపై, ముఖ్యంగా విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరత, విద్యార్థుల ఇబ్బందులపై నిరంతరం పోరాడతానని ఆయన స్పష్టం చేశారు. జ్ఞానేశ్వర్ నియామకం పట్ల కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ 2026 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను విశ్వవిద్యాలయ ఉపకులపతి (వైస్ ఛాన్సలర్) ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం కేయూలోని వీసీ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంతో కలిసి ఆయన వీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ కార్యకలాపాలు, సెలవుల వివరాలు, అకడమిక్ సమాచారంతో కూడిన ఈ డైరీ, క్యాలెండర్లు అధ్యాపకులకు, సిబ్బందికి, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఆకర్షణీయమైన రీతిలో వీటిని రూపొందించిన పబ్లికేషన్ సెల్ అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు ఆచార్య ఆర్.మల్లికార్జున రెడ్డి (యూజీసీ కోఆర్డినేటర్), డాక్టర్ మహమ్మద్ హబీబుద్దీన్ (డిప్యూటీ రిజిస్ట్రార్, ఇంచార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్), డాక్టర్ ఎం.నరసింహ రావు (డిప్యూటీ రిజిస్ట్రార్, పబ్లికేషన్ సెల్ సంచాలకులు), పంజాల శ్రీధర్ (డిప్యూటీ రిజిస్ట్రార్), డాక్టర్ పృథ్వీ రాజు వల్లాల (ప్రజా సంబంధాల అధికారి) పాల్గొన్నారు. పబ్లికేషన్ సెల్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ డైరీ, క్యాలెండర్ల పట్ల వర్సిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి

# లోకిని శ్రీనివాస్‌కు 'డాక్టరేట్'



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి లోకిని శ్రీనివాస్ పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఆయన సమర్పించిన పరిశోధనా పత్రానికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ "ఖమ్మం జిల్లాలో గిరిజన మహిళ సాధికారత – ఒక అధ్యయనం" అనే అంశంపై సుదీర్ఘ పరిశోధన చేశారు. రాజనీతి శాస్త్ర విభాగం ప్రొఫెసర్ జి.వీరన్న పర్యవేక్షణలో ఆయన తన థీసిస్‌ను పూర్తి చేశారు. తన పరిశోధన కాలంలో శ్రీనివాస్ పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలను సమర్పించి విద్యావేత్తల ప్రశంసలు పొందారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన శ్రీనివాస్, విద్యార్థి దశ నుంచే సామాజిక అంశాలపై చురుగ్గా ఉండేవారు. మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా కేయూ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన చారిత్రాత్మక మహా పాదయాత్రలో ఆయన భాగస్వామ్యం ఉంది. పరిశోధనలో రాణించి డాక్టరేట్ సాధించిన లోకిని శ్రీనివాస్‌ను వర్సిటీ ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, ఇందుర్తి గ్రామస్తులు, బంధుమిత్రులు అభినందించారు.

# బ్యాంకింగ్ సేవలపై అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. నాబార్డ్ సౌజన్యంతో బ్యాంక్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన కళాజాతర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాకారులు జానపద గీతాల ద్వారా, మ్యాజిక్ షోల ద్వారా బ్యాంక్ ఖాతాల ప్రాముఖ్యత, పొదుపు పథకాలు, డిజిటల్ లావాదేవీల గురించి గ్రామస్తులకు వివరించి ఆకట్టుకున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన మామిడాల ఇంద్రయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆయన గతంలో గ్రామీణ బ్యాంకులో వెయ్యి రూపాయలతో ఎస్ బీఐ జనరల్ ఇన్సూరెన్స్ చేయించుకున్నారు. బీమా నిబంధనల ప్రకారం, మృతుడి భార్య మంజులకు మంజూరైన రూ.20,00,000 చెక్కును రీజినల్ మేనేజర్ బాలనాగు చేతుల మీదుగా అందజేశారు. స్వల్ప ప్రీమియంతో ఇన్సూరెన్స్ చేయించుకోవడం వల్ల ఆపద కాలంలో ఒక కుటుంబానికి ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక భరోసా లభించిందని అధికారులు పేర్కొన్నారు. బ్యాంకు మేనేజర్ నాగేందర్, గ్రామ సర్పంచ్ కవిత తిరుపతి, బ్యాంక్ సిబ్బంది, సీఎస్పీలు, సీఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

• అదనపు కలెక్టర్ రవి



**వరంగల్ వాయిస్, దామెర :** సాదా బైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ నిడగుగొమ్ముల రవి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వారు దామెర మండల తహాశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయంలోని పలు కీలక రికార్డులను, భూ సంబంధిత దస్త్రాలను అదనపు కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి, పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు, సాదా బైనామాల దరఖాస్తుల పురోగతిపై తహాశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి వచ్చిన సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, దామెర తహాశీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు భాస్కర్ రెడ్డి, సంపత్ రావు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మండల కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖిలా వరంగల్ మండల ఏఐఎస్ఎఫ్ మహాసభలు శివ అభి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన కోసం, విద్యార్థుల హక్కుల కోసం మండల స్థాయిలో పోరాటాలను ఉధృతం చేయాలని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మహాసభల అనంతరం ఖిలా వరంగల్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రేవంత్, మండల కార్యదర్శిగా కదమంచి నిఖిల్, సహాయ కార్యదర్శిగా కార్తీక్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్ సింగ్, కమిటీ సభ్యులుగా ప్రకాష్, రమేష్, రాకేష్, నిఖిల్, సంతోష్, ప్రమోద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. విద్యార్థుల పక్షాన నిలబడి నిరంతరం పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మత్తులు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో దెబ్బతిన్న మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు మంగళవారం యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు పూర్తి చేశారు. గ్రామానికి మంచినీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు రంధ్రాలు పడటంతో నీరంతా వృథాగా బయటకు పోవడమే కాకుండా, గ్రామస్తులకు నీటి సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ తక్షణమే స్పందించారు. స్వయంగా పర్యవేక్షించి, జేసీబీ సహాయంతో పైప్‌లైన్ ఉన్న ప్రాంతాన్ని తవ్వించారు. లీకేజీలను గుర్తించి వెల్డింగ్ మరియు ఇతర మరమ్మత్తులు చేయించి సమస్యను పరిష్కరించారు. పనులు పూర్తయిన వెంటనే గ్రామానికి మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. మంచినీటి సమస్య తలెత్తకుండా సకాలంలో స్పందించి మరమ్మత్తులు చేయించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ, నాయకులు రేపాక రాజేందర్, మామిళ్ల మల్లికార్జున్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉర్సు ఉత్సవాలపై ఏఎస్పీ సమీక్ష



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** చారిత్రక వరంగల్ ఉర్సు జాగీర్‌లోని ప్రసిద్ధ హజ్రత్ మాషూక్–ఎ–రబ్బానీ (రహ్) దర్గా షరీఫ్ వార్షిక ఉరూస్ ఉత్సవాలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఏఎస్పీ శ్రీ శుభమ్ నగ్రాలే, ఐపీఎస్ దర్గాను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాబోయే ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఏఎస్పీ భద్రతా, పరిపాలనా పరమైన ఏర్పాట్లపై దర్గా పీఠాధిపతులు (సజ్జాదె) జనాబ్ నవీద్ బాబా సాహెబ్, ఉబైద్ బాబా సాహెబ్‌లతో సుదీర్ఘంగా చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్, క్యూ లైన్లు, సీసీ కెమెరాల నిఘాపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి ఈ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. హజ్రత్ మాషూక్–ఎ–రబ్బానీ వారి వార్షిక సాండల్, ఉరూస్ వేడుకలు ఈ నెల 11, 12 తేదీలలో అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా ఉర్సు ప్రాంతంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

# గొర్రెల మందపై కుక్కల దాడి

◆ ఎనిమిది గొర్రెలు మృతి



**వరంగల్ వాయిస్, గణపురం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. సోమవారం అర్థరాత్రి గొర్రెల మందపై దాడి చేసి ఎనిమిది గొర్రెలను విచక్షణారహితంగా కొరికి చంపేశాయి. గ్రామానికి చెందిన మొగిలి రాజయ్య అనే రైతు తన ఇంటి ఆవరణలోని పాకలో గొర్రెలను కట్టేశాడు. రక్షణ కోసం ఏర్పాటు చేసిన జాలిని పీకేసిన వీధి కుక్కలు, లోపలికి చొరబడి గొర్రెలపై దాడి చేశాయి. ఈ దాడిలో ఎనిమిది గొర్రెలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వేడుకున్నాడు. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ వీరమల్ల సంపత్ రెడ్డి బాధితుడిని పరామర్శించారు. చనిపోయిన గొర్రెలను పరిశీలించి, బాధితుడికి న్యాయం జరిగేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇప్పటికే కోతుల బెడద ఎక్కువగా ఉండగా, ఇప్పుడు వీధి కుక్కల బీభత్సం తోడవ్వడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కలం యోధుడు జర్నలిస్ట్ లక్ష్మణ్ రావు

◆ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఘన నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పత్రికా రంగంలో మఫిషియల్ ఎడిటర్‌గా, అసిస్టెంట్ ఎడిటర్‌గా విశిష్ట సేవలందించి, గ్రామీణ జర్నలిజానికి కొత్త దిశానిర్దేశం చేసిన సీనియర్ జర్నలిస్ట్ టి.కె. లక్ష్మణ్ రావు మృతిపట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా జర్నలిస్టులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో 'లక్ష్మణ్ రావు వెల్ విషర్స్ సర్కిల్' ఆధ్వర్యంలో జరిగిన సంతాప సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు కదిలివచ్చారు. ఈ సంతాప సభలో యూనియన్లకు అతీతంగా డెస్క్ జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టులు, స్టాఫ్ రిపోర్టర్లు, గ్రామీణ విలేకరులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. లక్ష్మణ్ రావు వృత్తిపరమైన అంకితభావాన్ని, ఆయనలోని నిరాడంబరత్వాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు శెంకేసి శంకర్ రావు, వర్ధెల్లి లింగయ్య, గడ్డం కేశవమూర్తి, గడ్డం రాజిరెడ్డి, గోకారపు శ్యాం, కెంచ కుమారస్వామి (కేకే) తదితరులు మాట్లాడుతూ.. లక్ష్మణ్ రావు కేవలం ఒక జర్నలిస్ట్ మాత్రమే కాదని, ఎంతోమందికి ఉపాధి కల్పించిన ఒక 'ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్' అని కొనియాడారు. ఉదయం, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, సాక్షి వంటి ప్రముఖ పత్రికల్లో కీలక బాధ్యతలు నిర్వహించినా, ఆయన ఎప్పుడూ సాదాసీదాగా ఉంటూ అందరినీ ప్రోత్సహించేవారని గుర్తుచేశారు. సంచలనాత్మక శీర్షికలు (హెడ్ లైన్స్) పెట్టడంలో ఆయనది అందెవేసిన చేయి అని, గ్రామీణ ప్రజల జీవితాలను తన కథనాలతో ప్రతిబింబించేవారని కొనియాడారు. లక్ష్మణ్ రావు మరణం తెలుగు జర్నలిజానికి, ముఖ్యంగా గ్రామీణ జర్నలిజానికి తీరని లోటని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వలిశెట్టి సుధాకర్, పొడిశెట్టి విష్ణువర్ధన్, నయీంపాష, పవన్ కుమార్, డెస్క్ జర్నలిస్టులు వనం శ్రీకాంత్, రాజు, కిరణ్, ఫొటో జర్నలిస్టుల సంఘం నాయకులు గొట్టె వెంకన్న, తిరుమల్, ప్రదీప్, జర్నలిస్టులు విజయ భాస్కర్, రజాక్, నర్సయ్య, జన్ను రవి, రాజు గౌడ్ పాల్గొన్నారు.

# వరంగల్‌కు 100 ఈవీ బస్సులు కేటాయించండి

## అసెంబ్లీలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, రవాణా సౌకర్యాల మెరుగుదలకు మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో ఆయన ఈవీ వాహనాల వినియోగం, భద్రతపై కీలక ప్రసంగం చేశారు. ఎలక్ట్రిక్ టూ-వీలర్లలో బ్యాటరీలు పేలుతున్నాయన్న వార్తలతో ప్రజల్లో కొంత భయాందోళన నెలకొందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రమాదాలపై ఉన్న సందేహాలను నివృత్తి చేసి, ఈవీ వాహనాలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఏదైనా ప్రత్యేక పాలసీని అమలు చేస్తోందా? అని ఆయన ప్రశ్నించారు. పర్యావరణ హిత రవాణా కోసం కృషి చేస్తున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఎమ్మెల్యే నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. వరంగల్ జిల్లాకు త్వరలోనే 100 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని సభలో హామీ ఇచ్చారు.

# వృద్ధురాలికి అండగా 'భారతి చారిటబుల్ ట్రస్ట్'



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** పేదలు, వృద్ధులకు అండగా నిలవడమే నిజమైన మానవత్వమని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు చాటిచెప్పారు. వరంగల్ రామన్నపేట పరిధిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన నిరుపేద వృద్ధురాలు పుల్లూరు కీర్తిమాలకు పెరుగుతున్న చలి తీవ్రత నుంచి రక్షణ కల్పించేందుకు ట్రస్ట్ తరపున మంగళవారం స్వెట్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. మనం సంపాదించే సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు, అనాథలకు, వికలాంగులకు మరియు ఆసరా లేని వృద్ధులకు సహాయంగా అందిస్తే కలిగే సంతృప్తి వర్ణించలేనిదని అన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా అభాగ్యులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తో పాటు హుస్సేన్, మహేందర్, రమేష్, స్థానిక ప్రజలు పాల్గొని ట్రస్ట్ చేస్తున్న సేవలను అభినందించారు.

# టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, శంభునిపేట :** ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సంస్థ టీపీటీఎఫ్ అని శంభునిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు శారదా భాయి కొనియాడారు. మంగళవారం పాఠశాల ఆవరణలో టీపీటీఎఫ్ ముద్రించిన 2026 నూతన సంవత్సర వాల్ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శారదా భాయి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులుగా పాఠశాలల్లో బాధ్యతాయుతంగా పనిచేస్తూనే, మరోవైపు తమ హక్కుల కోసం ఉద్యమించడం అభినందనీయమన్నారు. టీపీటీఎఫ్ సంస్థకు ఎనిమిది దశాబ్దాల పోరాట చరిత్ర ఉందని, నేడు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న అనేక సౌకర్యాలు ఇలాంటి సంఘాల పోరాట ఫలితమేనని ఆమె గుర్తు చేశారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఊటుకూరి అశోక్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన ఐదు డీఏలు, పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉపాధ్యాయులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బెల్లంకొండ పూర్ణ చందర్, పూర్వ జిల్లా అధ్యక్షులు సోమేశ్వర్, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి మనోజ్, జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటర్ జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి/మల్హర్ :** పొరపాట్లు లేని, స్వచ్ఛమైన తుది ఓటర్ జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పురపాలక తుది ఓటర్ జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ జాబితాలో ఖచ్చితత్వం ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమని స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు మరియు ఇతర అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగించే ప్రక్రియలో రాజకీయ పార్టీలు నిర్మాణాత్మకమైన సూచనలు ఇవ్వాలని కోరారు. ఓటర్ నమోదు, మార్పులు లేదా తొలగింపులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా అధికారులకు సమర్పించాలని సూచించారు. వీటిపై ఫీల్డ్ స్థాయిలో క్షుణ్ణంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, టీపీఓ సునీల్, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్యనాయక్ తండాను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండల పరిధిలోని సూర్యనాయక్ తండా అభివృద్ధికి బాటలు వేస్తూ, గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలపడమే తమ లక్ష్యమని గ్రామ సర్పంచ్ లావుడియా రమ రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో నూతనంగా ఎన్నికైన పంచాయతీ పాలక వర్గాన్ని, కార్యదర్శిని తెలంగాణ స్టేట్ ట్రైబల్ లీడర్ మాలోతు లింగు నాయక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాలోతు లింగు నాయక్ మాట్లాడుతూ.. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా పాలక వర్గం పని చేయాలని సూచించారు. సర్పంచ్ రమ రవీందర్ నాయకత్వంలో గ్రామంలోని మౌలిక వసతుల కల్పనకు, గిరిజనుల సంక్షేమానికి పాలక వర్గ సభ్యులందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. పారదర్శక పాలనకు ప్రాధాన్యం: సర్పంచ్ రమ రవీందర్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధే ధ్యేయంగా అవినీతికి తావులేని పారదర్శక పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. తండాలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన గ్రామస్తులకు, తనను సత్కరించిన లింగు నాయక్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, తండా వాసులు పాల్గొన్నారు.

# వెనిజులాపై అమెరికా దాడి పాశవికం

◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి
◆ ట్రంప్ నిరంకుశత్వాన్ని మోదీ ఎండగట్టాలి
◆ 18న ఖమ్మం సభను జయప్రదం చేయండి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వెనిజులా దేశ సార్వభౌమత్వాన్ని కాలరాస్తూ అమెరికా జరిపిన సైనిక దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వెనిజులాపై దాడి చేసి, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదూరోను, ఆయన కుటుంబాన్ని అరెస్టు చేసే అధికారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు లేదని మండిపడ్డారు. వెనిజులాలోని చమురు సంపదను హస్తగతం చేసుకోవడమే లక్ష్యంగా అమెరికా ఈ నిరంకుశ చర్యకు పాల్పడిందని ఆరోపించారు. మదూరోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ విషయంలో ప్రధాని మోదీ మౌనం వీడాలని కోరారు. అమెరికా సామ్రాజ్యవాద ధోరణిని భారత ప్రభుత్వం ఎండగట్టాలని, దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని నివారించాలని సూచించారు. సీపీఐ ఆవిర్భవించి 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ చారిత్రాత్మక సభకు హనుమకొండ జిల్లా నుంచి వేలాదిగా కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని కోరారు. రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నేదునూరి జ్యోతి, మద్దెల ఎల్లేష్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఏదునూరి వెంకట్రాజం, బత్తిని సదానందం, ఎన్.అశోక్ స్టాలిన్, బాషబోయిన సంతోష్, డాక్టర్ పల్లేరు వీరస్వామి,నాయకులు మాలోతు శంకర్ నాయక్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, కండె నర్సయ్య, రాసమల్ల దీనా, కొట్టె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన వల్లెంకుంట సర్పంచ్



**వరంగల్ వాయిస్, మల్హర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మల్హర్ మండలం వల్లెంకుంట గ్రామ నూతన సర్పంచ్ బొమ్మ రజిత సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాల్లోని మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి ప్రధాన సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చి, నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని దిశానిర్దేశం చేశారు. గ్రామ సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా సర్పంచ్ రజిత కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో వల్లెంకుంట ఉప సర్పంచ్ కటకం స్వప్న, నాయకులు బొమ్మ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు 'సిరికొండ' పరామర్శ



**వరంగల్ వాయిస్, శాయంపేట:** తెలంగాణ తొలి స్పీకర్, ప్రస్తుత శాసనసభ ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మంగళవారం శాయంపేట మండలంలో పర్యటించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అనారోగ్యం, ప్రమాదాలకు గురైన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి ఓదార్చారు. శాయంపేట టౌన్ మాజీ అధ్యక్షులు పొడిశెట్టి గణేష్ భార్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురవడంతో, వారి నివాసానికి వెళ్లిన సిరికొండ బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనారోగ్య కారణాలతో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన మంత్రి రవీందర్, గోరంట్ల నరసయ్య కుటుంబాలను ఆయన సందర్శించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం సూరంపేట, గట్ల కనపర్తి గ్రామాల్లో మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి, పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ యాత్రలో మండల నాయకులు గుర్రం రవీందర్, రమేష్, ముంజల నాగరాజ్, కర్ణాకర్, గోపి, మహేందర్ రెడ్డి, రంజిత్, సారయ్య, విజయ్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీరామ భక్తాంజనేయ అభిషేక మహోత్సవం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో వెలసిన శ్రీరామ భక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ సర్పంచ్ డాక్టర్ ఇంజపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వినయ్ ఆధ్వర్యంలో స్వామివారికి చందనం, తమలపాకులు, ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం, ప్రత్యేక అర్చనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లాయి. లోక కల్యాణార్థం, గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఈ పూజలు నిర్వహించినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ ఇంజపల్లి శ్రీనివాస్–సుజాత దంపతులతో పాటు బెక్కం స్వామి–అహల్య, మర్రి లింగమూర్తి, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు అప్పాల శ్రీనివాస్, ఎడవల్లి అన్వేష్, పొన్నం ఉదయ్, బూర సంపత్, గ్రామస్థులు పాల్గొన్నారు. ఇకపై ప్రతి మంగళవారం, శనివారం శ్రీరామ భక్తాంజనేయ స్వామి వారికి అర్చకులు వినయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయి.

# 11న హనుమకొండలో 'ఓసీ సింహగర్జన'

- బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ఓసీలకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టేందుకు, తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ నెల 11న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో లక్ష మందితో 'రాష్ట్ర స్థాయి ఓసీ సింహగర్జన' సభను నిర్వహించనున్నట్లు ఓసీ జేఏసీ నాయకులు ప్రకటించారు. మంగళవారం కాశీబుగ్గ మున్సిపల్ పార్కులో డాక్టర్ గుండా రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన రెడ్డి, వైశ్య, వెలమ, బ్రాహ్మణ, మార్వాడీ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలపై ఈ సభ ద్వారా గళం ఎత్తనున్నట్లు నాయకులు తెలిపారు. సమావేశంలో డాక్టర్ గుండా రవీందర్, ఇతర నాయకులు మాట్లాడుతూ.. ఓసీల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా 'ఓసీ కమిషన్' ఏర్పాటు చేయాలి. ఈడబ్ల్యూఎస్ అమలులో జరుగుతున్న అన్యాయాలను సరిదిద్ది, అర్హులైన ప్రతి పేదవాడికి ఫలాలు అందేలా చూడాలి. అగ్రవర్ణ పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, వయోపరిమితి పెంపు వంటి సౌకర్యాలు కల్పించాలి. రాష్ట్ర స్థాయి నాయకులు దుబ్బా శ్రీనివాస్ మాట్లాడుతూ.. జనవరి 11న మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సింహగర్జన సభకు ఓసీ సామాజిక వర్గాలన్నీ తమ కుటుంబాలతో కలిసి వేలాదిగా తరలివచ్చి దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసయ్య, డాక్టర్ పుల్లూరు సంపత్, మంచాల నారాయణ, ఏలుగూరి శ్రీనివాస్, నాగరాజు శ్రీనివాస్, పార్శి నవీన్, సోమేశ్వర్, రాజు, ఇతర ఓసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి సిరికొండ పరామర్శ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన కూనూరు రాజు ఇటీవల వేములవాడ దైవదర్శనానికి వెళ్తూ కమలాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల తెలంగాణ తొలి శాసన సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన బాధితుని నివాసానికి వెళ్లి, మృతుని చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ శాయంపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బోడకుంటి సురేష్, బొమ్మకంటి శ్రీకాంత్, సుద్దాల సురేష్, అనంతుల కిరణ్ రాజ్, స్థానిక నాయకులు వొంటేల మహేందర్, నూటెంకి సుధాకర్, కుసుమ సురేష్, చెన్నబోయిన సాంబయ్య, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మీ భద్రతే.. మా బాధ్యత



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** "ప్రయాణికుల భద్రతే పోలీసుల బాధ్యత.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలి" అని ఆత్మకూరు సీఐ ఆర్. సంతోష్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని గుడెప్పాడు సెంటర్‌లో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహన అనంతరం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బ్రీత్ అనలైజర్ ద్వారా వాహనదారులను పరీక్షించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురిపై కేసులు నమోదు చేశారు. రాబోయే మేడారం జాతర నేపథ్యంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, భక్తులు, ప్రయాణికులు క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సీఐ సూచించారు. ఆత్మకూరు ఎస్సై రవీంద్ర చారి, పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## వెంకటాపురంలో 'విద్యుత్ ప్రజా బాట'





**వరంగల్ వాయిస్, దామెర :** విద్యుత్ వినియోగదారుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'విద్యుత్ ప్రజా బాట' కార్యక్రమం మంగళవారం దామెర మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఉత్సాహంగా జరిగింది. హనుమకొండ జిల్లా సేఫ్టీ ఆఫీసర్, హనుమకొండ రూరల్ డీఈ.విజయేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పంచగిరి రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు వినియోగదారులు సొంతంగా మరమ్మతులు చేయకూడదని, వెంటనే సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మోటార్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు అమర్చాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని వెంటనే పరిష్కరించాలని స్థానిక ఏఈని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈ గుర్రం రమేష్, అసిస్టెంట్ ఏఈ చందన, ఎల్.ఎం.లు మనోహర్, గిరిబాబు, రవీందర్, కనుకుంట్ల శంకర్, ప్రభాకర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వైద్యుడికి, రోగికి ఫార్మసిస్టే వారధి

- డీఎంహెచ్ఓ డాక్టర్ అల్లం అప్పయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజారోగ్య సంక్షేమంలో ఫార్మసీ అధికారుల పాత్ర అత్యంత కీలకమని హన్మకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య కొనియాడారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ ప్రాంగణంలో హన్మకొండ, వరంగల్ జిల్లాల ఫార్మసీ అధికారుల అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. రోగికి, వైద్యుడికి మధ్య వారధిగా ఉంటూ ఔషధాల పంపిణీలో ఫార్మసిస్టులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 'ప్రత్యేక ఫార్మసీ డైరెక్టరేట్' ఏర్పాటు చేయాలని కోరుతూ ఆరోగ్య శాఖ మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. రాబోయే పీఆర్సీలో ఫార్మసిస్టుల అర్హతలకు, పనికి తగిన విధంగా మెరుగైన వేతనాలు అందేలా పే రివిజన్ కమిషన్ అధికారులను కలవనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు మాట్లాడుతూ.. కొత్త మెడికల్ కళాశాలలు, అనుబంధ ఆస్పత్రుల్లో ఫార్మసీ ఆఫీసర్స్, సీనియర్, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పోస్టుల మంజూరిపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షులు ఉప్పు భాస్కరరావు మాట్లాడుతూ.. మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా గ్రేడ్–2 పోస్టుల భర్తీ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, త్వరలోనే నియామకాలు పూర్తికానున్నాయని వెల్లడించారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు నార్ల వేణు, కార్యదర్శులు సతీష్, రాజేందర్, వరంగల్ సీఎంఎస్ ఇంచార్జ్ నాగమణి, హనుమకొండ సీఎంఎస్ సీనియర్ ఆఫీసర్ వి.నళిని, ఎంజీఎం సీనియర్ ఆఫీసర్ మరియమ్మ, నాయకులు సంతోష్, భిక్షపతి, సత్యం, నాగేందర్, ఉభయ జిల్లాలకు చెందిన వందమంది ఫార్మసీ అధికారులు పాల్గొన్నారు.





## చిరు సినిమా టిక్కెట్ రూ.1.11లక్షలకు..

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేయగా హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. తాజాగా అమలాపురంలో ఈ సినిమా టికెట్‌ను ఒక అభిమాని వేలంపాటలో రూ.1.11లక్షలకు సొంతం చేసుకున్నారు. పట్టణంలోని వెంకటరమణ థియేటర్‌లో ఈ వేలంపాట జరగ్గా.. మెగా అభిమాని వెంకట సుబ్బారావు ఈ టికెట్‌ను దక్కించుకున్నారు.

## నేనిప్పుడే పెళ్లి చేసుకోవడం లేదు

రూమర్స్‌కు చెక్ పెట్టిన మీనాక్షి చౌదరి

'అనగనగా ఒక రాజు'తో ఈ సంక్రాంతికి అలరించడానికి సిద్ధమయ్యారు నటి మీనాక్షి చౌదరి . నవీన్ పొలిశెట్టితో కలిసి ఆమె నటించిన ఈ చిత్రం జనవరి 14న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మీనాక్షి తన పెళ్లంటూ వస్తోన్న రూమర్స్‌పై స్పందించారు. 'లక్కీ భాస్కర్' తర్వాత తల్లి పాత్రలు చేయడానికి మీకు ఆసక్తి లేదని చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి.. నిజమేనా?' అనే ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. అసలు రూమర్స్ ఎలా సృష్టిస్తారో నాకు అర్థం కావట్లేదు. నేను అలాంటి కామెంట్స్ ఎక్కడా చేయలేదు. కథ, పాత్రకు ప్రాధాన్యమిస్తాను. కథ బాగుంటే ఎలాంటి పాత్రలోనైనా చేస్తాను. నేను పెళ్లి చేసుకోనున్నట్లు కూడా ఇటీవల ఎన్నో వార్తలు వచ్చాయి. అలాంటి రూమర్స్ విని నేను అలసిపోయాను. వాటిలో నిజం లేదు. నేను ఇప్పుడే పెళ్లి చేసుకోవడం లేదు' అని మీనాక్షి స్పష్టతనిచ్చారు. టాలీవుడ్ యంగ్ హీరోతో మీనాక్షి ప్రేమలో ఉన్నట్లు ఇటీవల జోరుగా ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని త్వరలోనే పెళ్లి చేసుకోనున్నట్లు వార్తలు వచ్చాయి.

## టాక్సిక్‌లో రుక్మిణీ వసంత్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్‌దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో రుక్మిణి వసంత్ ఉన్నట్లు టీమ్ ప్రకటించింది. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మోడ్రన్ డ్రెస్‌లో పబ్‌లో నడుస్తూ రుక్మిణి కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌ల లుక్‌ను విడుదల చేశారు. ఇప్పుడు రుక్మిణి కూడా అందులో ఉన్నట్లు అధికారికమైంది. దీంతో ఇందులో నలుగురు హీరోయిన్స్ అయ్యారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్‌గా, నయనతార గంగ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.




## ఉర్రూతలూగించేలా ప్రభాస్ నాచే నాచే సాంగ్


రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ది రాజా సాబ్‌పై ప్రేక్షకుల్లో అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దర్శకుడు మారుతి హారర్ ఫాంటసీ జానర్‌లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండటంతో ప్రచార కార్యక్రమాలు వేగం పెంచాయి. ఇప్పటికే విడుదలైన 'రెబల్ సాబ్', 'సహనా సహనా' పాటలు, 'రాజే యువరాజే' మ్యూజిక్ బిట్ సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా విడుదలైన మరో స్పెషల్ సాంగ్ చర్చనీయాంశంగా మారింది.సోమవారం ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో 'నాచే నాచే' ఫుల్ వీడియో సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ పాట 1982లో మిథున్ చక్రవర్తి నటించిన డిస్కో డ్యాన్సర్ సినిమాలోని సూపర్ హిట్ నంబర్ కోయి యహాన్ నాచే'కు ఆధునిక రీమిక్స్‌గా రూపొందింది. అప్పట్లో బప్పీ లహరి అందించిన ఒరిజినల్ ట్యూన్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత అదే పాటను నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా కొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. తమన్ ఈ పాటకు ఎనర్జిటిక్ బీట్ ఇచ్చారు. నకాష్ అజీజ్, బృందా కలిసి ఈ పాటను ఆలపించారు. 'నాచే నాచే' పాటలో ప్రభాస్ తన స్టైలిష్ స్వాగ్‌తో పాటు డ్యాన్స్‌లోనూ కొత్త కోణాన్ని చూపించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ ముగ్గురూ గ్లామర్‌తో పాటు స్టెప్పుల విషయంలోనూ పోటీపడుతూ కనిపించారు. ప్రభాస్‌కు జోడీగా ముగ్గురు హీరోయిన్లు కనిపించడం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గ్రీస్‌లోని అందమైన లొకేషన్లలో భారీ స్థాయిలో షూట్ చేయడంతో పాట విజువల్స్ గ్రాండ్‌గా కనిపిస్తున్నాయి. కొత్త తరహా కాస్ట్యూమ్స్, స్టైలింగ్ కూడా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.ఈ పాటను హిందీ, తమిళ్ భాషల్లో విడుదల చేయగా, తెలుగు వెర్షన్‌ను ప్రత్యేకంగా రిలీజ్ చేయడం లేదని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు ప్రేక్షకులు కూడా థియేటర్లలో హిందీ వెర్షన్‌లోనే ఈ పాటను చూడనున్నారు. ఈ నిర్ణయం సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. సంక్రాంతి రేసులో ప్రభాస్ ఈసారి ఎలాంటి మ్యాజిక్ చూపిస్తాడో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## తెలుగు తెరపై సంక్రాంతి సందడి

**ఏకంగా ఐదు తెలుగు, రెండు డబ్బింగ్ సినిమాల విడుదల**

**7న మూవీ ట్రైలర్ల విడుదలకు సన్నాహాలు**

సంక్రాంతి సీజన్ వచ్చిందంటే టాలీవుడ్‌లో పోటీ మామూలుగా ఉండదు. ఈసారి ఆ పోటీ మరింత హాట్‌గా మారింది. మార్కెట్ ఉన్న స్టార్ హీరోలతో పాటు పరభాషా హీరోలు కూడా రంగంలోకి దిగుతుండటంతో థియేటర్లు సందడితో నిండబోతున్నాయి. జనవరి 9 నుంచి 14 మధ్య ఐదు భారీ సినిమాలు విడుదలకు సిద్ధమవుతుండగా, వాటి ప్రమోషన్లు కూడా అదే స్థాయిలో జోరుగా సాగుతున్నాయి. విజయ్, శివకార్తికేయన్ వంటి స్టార్ హీరోల సినిమాలు పక్క భాషల్లో విడుదలవుతుండగా, తెలుగులో 'ది రాజా సాబ్', 'మన శంకర వరప్రసాద్ గారు', 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 'అనగనగా ఒక రాజు', 'నారీ నారీ నడుమ మురారి' వంటి చిత్రాలు సంక్రాంతి బరిలో నిలిచాయి. ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించేందుకు ట్రైలర్లు, సాంగ్స్, గ్రాండ్ ఈవెంట్స్‌తో మేకర్స్ గట్టి ఎ□`లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలో జనవరి 7వ తేదీ టాలీవుడ్ క్యాలెండర్‌లో ప్రత్యేక రోజుగా మారింది. ఒకే రోజున నాలుగు పెద్ద ఈవెంట్లు జరగనున్నాయి. ఇది ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రమోషన్లలో భాగంగా రెండు ట్రైలర్ లాంచ్ ఈవెంట్స్, ఒక భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్, మరో ప్రమోషనల్ ఈవెంట్ ఒకే రోజున ఎ□`లాన్ చేయడం ఆసక్తికరంగా మారింది. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రానికి జనవరి 7న హైదరాబాద్‌లో ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. దీనికి 'మెగా విక్టరీ ప్రీ రిలీజ్ ఈవెంట్' అనే టైటిల్ పెట్టారు. వేదిక వివరాలు ఇంకా వెల్లడిరచకపోయినా, ఈ కార్యక్రమంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే రోజు సాయంత్రం 4.05 గంటలకు రవితేజ హీరోగా నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. అలాగే జనవరి 7 సాయంత్రం 6.04 గంటలకు నవీన్ పోలిశెట్టి నటించిన 'అనగనగా ఒక రాజు' ట్రైలర్ విడుదల కార్యక్రమం ప్లాన్ చేశారు.



# వారంలో మూడు రోజులు ప్రజాబాట

- క్షేత్ర స్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎండీ వరుణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యుత్ వినియోగదారుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే కార్యక్రమమే 'ప్రజా బాట' అని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం హనుమకొండ సర్కిల్ పరిధిలో ఎస్ఎస్ 29, భవాని నగర్ నక్కలగుట్ట సెక్షన్ లో ప్రజాబాట కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భాంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి కాలనీ వాసులతో కలసి సమస్యలపై వాకబ్ చేశారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ వారంలో మూడు రోజులు ప్రతి మంగళవారం, గురువారం, శనివారం ప్రజా బాట నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నిసర్కిళ్లలో డీఈలు, ఏడీఈలు, ఏఈలు విడివిడిగా క్షేత్ర స్థాయిలో, సిబ్బందితో కలిసి గ్రామాలను సందర్శించాలన్నారు. 11 కేవీ ఫీడర్లు వారీగా గ్రామాలను షెడ్యూల్ చేసి కార్యక్రమానికి ఒక రోజు ముందు సర్కిల్ వాట్స్ అప్ గ్రూపుల్లో పోస్ట్ చేయడంతోపాటు ఆ ప్రాంత వినియోగదారులకు తెలిసేలా వాట్సప్ గ్రూపులలో ప్రచారం చేయాలన్నారు. తరచుగా ట్రిప్పింగ్ ఫీడర్ల క్షేత్ర స్థాయి తనిఖీలు చేయాలని, లోడ్ బ్యాలెన్సింగ్, ఫీడర్ విభజన నిర్వహణ పగిలిపోయిన ఇన్సులేటర్లు, లోపభూయిష్టంగా ఉన్న జంపర్లను సరిచేయలన్నారు. వంగి ఉన్న స్తంభాలు, క్రాస్ ఆర్మ్స్ రెక్టిఫికేషన్లు, లెవల్ రోడ్ క్రాసింగ్‌లను గుర్తించి సరిచేయాలన్నారు.

అనవసరమైన ఎల్సీలను నివారించడానికి నియంత్రణ ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. లైన్ లలో కెపాసిటర్లను పెట్టడం, ఎల్టీ లూజ్ లైన్లను తిరిగి స్ట్రింగ్ చేయడం, అవసరమైన చోట స్పేసర్లను ఏర్పాటు చేయడం, డీటీఆర్ లు ఎక్కువగా లోడ్ అవుతున్నట్లు గుర్తిస్తే వాటి సామర్థ్యం పెంపు, ఎల్టీ లైన్ల బలోపేతం, ఎర్తింగ్ చేయడం లాంటి పనులు చేపట్టి వినియోగదారులలో మరింత నమ్మకం, విశ్వసనీయతను పెంపొందించాడనికి ప్రతి ఒక్క ఉద్యోగి నిబ్బద్దత్తో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్ , సీజీఎం కె.రాజు చౌహన్, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, డీఈ హనుమకొండ సాంబ రెడ్డి, డీఈ టెక్నికల్ ఎం.విజయేందర్ రెడ్డి, దర్శన్ కుమార్, ఏడీఈ ఇంద్రసేనా రెడ్డి, ఏఈ ప్రవీణ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# సమ సమాజ స్థాపనకు కృషి చేయాలి

- శాస్త్రీయ దృక్పథానికి విద్యార్థులు పోరాడాలి
- జేఎన్యు ప్రొఫెసర్ వికాస్ వాజ్పేయి



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** సమ సమాజ స్థాపనకు విద్యార్థులు కృషి చేయాలి జేఎన్యు ప్రొఫెసర్ వికాస్ వాజ్పేయి పిలుపునిచ్చారు. పీడీఎస్ యూ రాష్ట్ర 23వ మహాసభలు వరంగల్ పట్టణ కేంద్రంలోని పోచం మైదాన్ అబ్బూస్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తొలుత పీడీఎస్ యూ జెండాను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వి.శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఆహ్వాన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ తొలిపలుకులు అందించారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ప్రతినెల సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు అమరవీర సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించి జోహార్లు అర్పించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఎన్యు ప్రొఫెసర్ వికాస్ వాజ్పేయి మాట్లాడుతూ ప్రగతిశీల ఉద్యమాలకు ఆద్యం పోసిన ఒక విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్ యూ అని కొనియాడారు. పీడీఎస్ యూ రాష్ట్ర నాయకురాలు దీపా లక్ష్మి అధ్యక్షతన నూతన జాతీయ విద్యా విధానం- కర్తవ్యం అనే అంశంపై హెచ్సీయూ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం విద్యార్థులకు చదువును దూరం చేసిందన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ విద్య అందరి ద్రాక్షగా మార్చడానికి ప్రభుత్వం చేసిన కుట్రలో ఇది ఒక భాగం అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జాతీయ నాయకులు పి.మహేష్, నాయకులు సౌరవ్, రోహిత్, ఆర్ఎస్ వైఎఫ్ బాలరాజు, స్టూడెంట్స్ యూనియన్ ధీరజ్, ఏపీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.భాస్కర్, ఎం.వినోద్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు భువనగిరి మధు, జన్నారాపు రాజేశ్వర, డి.శ్రీకాంత్, మంద నవీన్, సంతోష్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఆర్.గౌతమ్ కుమార్, జి.మస్తాన్, జగజంపుల తిరుపతి, డి.ప్రణయ్ కుమార్, కె.శ్రీనివాస్, మామిడాల ప్రవీణ్, కోశాధికారి కె.రానా ప్రతాప్, ఆహ్వాన సంఘం నాయకులు రాచర్ల బాలరాజు, ఎలకంటి రాజేందర్, వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- వడ్డేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సందర్శన





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషపై పట్టు సాధించే విధంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడారు. ఆంగ్ల, తెలుగు, హిందీ భాషలో విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఆంగ్ల భాషలో ఆశించిన స్థాయిలో ప్రావీణ్యం చూపకపోవడంతో కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఇంగ్లీషులోనే మాట్లాడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజు గౌడ్, ఎంఈఓ నెహ్రూ, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక సాయం అందజేత

**వరంగల్ వాయిస్, చింతల్ :** నగరంలోని 36వ డివిజన్ చింతల్ ప్రాంతంలో సోమవారం రాత్రి సంభవించిన షార్ట్ సర్క్యూట్ తో ఎండి సర్వర్ ఇల్లు కాలిపోయింది. దీంతో సామాజికవేత్త, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, సుస్మిత గార్డెన్ యజమాని ఎల్.శ్రీనివాస్ సోమవారం బాధితుడి గృహాన్ని పరిశీలించారు. విద్యుదాఘాతానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సర్వర్ కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నట్లు గ్రహించిన ఆయన తన వంతు ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానంటూ ఎల్.శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

# ఉపసర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలంగాణ ఉపసర్పంచుల సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రమణబోయిన రాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు లావుడ్య రాములు నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు సంవత్సరాలపాటు రాజు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. డోర్నకల్ నియోజకవర్గంలోని చిలుకోడు గ్రామ ఉపసర్పంచ్ గా రమణబోయిన రాజు ఇటీవల విజయం సాధించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వ్యక్తిగత వివాదాలకు అతీతంగా ఉపసర్పంచుల ఐక్యతకు కృషి చేస్తానన్నారు. అదే విధంగా తన గ్రామ అభివృద్ధిలో కూడా కీలకంగా వ్యవహరిస్తానన్నారు.



# 97,570 ఎకరాల్లో వరి సాగు

- రబీపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

**వరంగల్ వాయిస్, మల్హర్ :** రబీ సాగుకు నీటి లభ్యత, ఎరువుల సరఫరాపై ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మొక్కజొన్న 29 వేల ఎకరాలు, వరి 97,570 ఎకరాల్లో సాగవుతున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. యూరియా కొరత లేదని స్పష్టం చేస్తూ, ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచే యూరియా విక్రయాలు ప్రారంభించాలన్నారు. విత్తనాలు, ఎరువుల అందుబాటును నిరంతరం తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,600 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని, అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు ఇండెంట్లు పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా రద్దీ నియంత్రణకు అదనపు యూరియా కౌంటర్లు ఏర్పాటు చేయాలని, అలాగే ఒకేసారి కాకుండా విడతల వారీగా యూరియా పంపిణీ చేయాలని తెలిపారు. వేసవి కాలంలో మైనర్, మేజర్ నీటి వనరుల కింద పంటల సాగు, నీటి లభ్యత తదితర అంశాలపై వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఇరిగేషన్ అధికారులు బసవ ప్రసాద్, తిరుపతిరావు, వ్యవసాయ శాఖ ఏడీలు, ఇరిగేషన్ డీఈలు పాల్గొన్నారు.